క్లుప్తంగా

సంరక్షణ కరువై ఎండుతున్న మొక్కలు

చెన్నారావుపేట : జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎవెన్యూ ప్లాంటేషన్ పేరుతో మండలంలోని శంకరం తండా నుంచి బాపూనగర్ వెళ్లే దారిలో సుమారు 10 రోజుల క్రితం నాటిన మొక్కలు సంరక్షణ కరువై ఎండిపోతున్నాయి. పశువులు మేస్తున్న పరిస్థితి కనపడుతోంది. నీళ్లు పోయకపోతుండడంతో చనిపోయే అవకాశాలున్నాయి. మొక్కలను రోడ్డుకు దూరంగా నాటించి సంరక్షించాలని తండావాసులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన నాయకుడు



వర్ధన్నపేట : తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని ఇల్లందకు చెందిన జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిషాల రాజేష్ హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకె అందజేశారు. అనంతరం రాజేష్ మాట్లాడారు. కోదండరామ్‌కు ఎమ్మెల్సీగా పదవి కట్టబెట్టడంలో చొరవ చూపారంటూ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుమన్



దుగ్గొండి : మండలంలోని తొగర్రాయికి చెందిన ప్రముఖ గాయకుడు నెల్లుట్ల సుమన్ తెలంగాణ సాంస్కృతిక సారథి (టీఎస్ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సుమన్‌కు జిల్లా అధ్యక్షుడు జూపాక శివ శుక్రవారం నియామాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సుమన్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ఉద్యోగుల హక్కుల కోసం పోరాడతామని తెలిపారు. సుమన్‌ను రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

ఏవైఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని కమ్మపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం (ఏవైఎస్) గ్రామ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మిట్టగడపల తిరుపతి మాట్లాడారు. అధ్యక్షుడిగా కొమ్ముక రవి, ఉపాధ్యక్షుడుగా మిట్టగడుపుల క్రాంతికుమార్, కార్యదర్శిగా జన్ను రాజు, కోశాధికారిగా రాజేశ్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

నిందితులను శిక్షించాలి

చెన్నారావుపేట : మండలంలోని జోజిపేట నారాయణతండాకు చెందిన వ్యవసాయ కూలీ అల్వాల ఆనంద్‌పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ పేదల ఆర్థిక, రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనంద్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని చెప్పారు. సమావేశంలో అణగారిన కులాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంబాబు, ఎంఆర్‌పీఎస్ నాయకులు జన్ను రవి, కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులను నియమించాలి

పర్వతగిరి : గ్రామాలన్నిటికీ రెవెన్యూ అధికారితోపాటు అసిస్టెంట్‌ను నియమించాలని తెలంగాణ రెవెన్యూ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య కస్నానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలను ఇతర శాఖలకు పంపించిందని గుర్తు చేశారు. ఆ నేపథ్యంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు లేకపోవడంతో రెవెన్యూ శాఖలో పనులు ముందుకు సాగడం లేదని చెప్పారు.

కేసు నమోదు

పర్వతగిరి : మండలంలోని దూపతండాకు చెందిన కొందరు ధ్వని కాలుష్యానికి పాల్పడుతుండడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు. స్థానికులు గురువారం అర్ధరాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో డయల్ 100కు సమాచారం అందించడంతో ఎస్సై, పోలీసు సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. తీజ్ ఉత్సవాల్లో ఘటన చోటు చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



దుగ్గొండి : వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



నెక్కొండ : రామాలయంలో..



గీసుకొండ : లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో..



పర్వతగిరిలో..



చెన్నారావుపేటలో..

దుగ్గొండి : శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. నాచినపల్లిలోని రామాలయంలో మహిళలతో అర్చకుడు ఎదుగురి రమేష్‌మూర్తి వ్రతం చేయించారు. వ్రతం చేయడం వల్ల కలిగే ఫలితాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్చకుడు నాగేందర్‌స్వామి, భజన మండలి సభ్యులు బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, బండారి కొమురయ్య, నంగునూరి సాంబయ్య, బండారి శ్రీనివాస్, శ్రీరామోజు ఉపేందర్, కటకం రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన మండపంలో మహిళలతో వేదమంత్రోచ్చారణల నడుమ అర్చకుడు బీవీఎస్.శాస్త్రి సామూహిక వరలక్ష్మి వ్రతం చేయించారు. శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శ్రీ సూక్త విధానంలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీలోని శ్రీలక్ష్మి నృసింహస్వామి ఆలయంలో, సరస్వతి శిశు మందిర్‌లో మహిళలతో అర్చకుడు పురుషోత్తమాచారి వ్రతం చేయించారు. మహిళలు ఉదయం నుంచే ఆలయానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు ఉమామహేశ్వర శర్మ, భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలవ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. ఇళ్లలో లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమతో కలశారాధన చేశారు. ఒకరికొకరు వాయినాలు అందించారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దేశ్వరాలయంలో బీఎం.శాస్త్రీ, సాయి శాస్త్రీ, గణేష్ శాస్త్రీ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు.

జంతు పరిశోధనలో విలువలు తప్పనిసరి



సదస్సులో సీడీ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ సురేష్, తదితరులు

- ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్ డైరెక్టర్ సురేష్ పోతాని

నర్సంపేట రూరల్ : ప్రయోగశాలలో జంతువులపై పరిశోధన చేసే సమయంలో హింసకు తావివ్వకుండా శాస్త్రీయ విధానంలో విలువలు పాటించడం తప్పనిసరి అని హైదరాబాద్‌కు చెందిన ఎన్ఏఆర్ ఎఫ్‌బీఆర్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ పోతాని అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో 'జంతు పరిశోధనలో నీతి బోధన' అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సీడీలను ఆవిష్కరించి ప్రసంగించారు. విద్యార్థులు ప్రయోగశాలలో పరిశోధన చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శాస్త్రీయ విధానాన్ని అవలంబించాలని చెప్పారు. సదస్సులో బిట్స్ అధినేత రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎస్ఎన్‌జీఐ ప్రతినిధి డాక్టర్ కృష్ణమోహన్, కళాశాల సెక్రెటరీ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, సదస్సు కన్వీనర్ మనీష్ కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పుట్ట రవి, జె.రవి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అశ్రద్ధ చేయొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ దేవేందర్

గీసుకొండ : సీజనల్ వ్యాధులను అశ్రద్ధ చేయొద్దని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దేవేందర్ కోరారు. మండలంలోని మచ్చాపూర్, ఊకల్ గ్రామాల్లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ దేవేందర్ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. జ్వరం, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.మధుసూదన్ రెడ్డి, ఏఎన్ఎంలు సదాలక్ష్మి, సుహాసిని, హెల్త్ అసిస్టెంట్ జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మూడోవిడత' కోసం రైతుల్లో ఆందోళన



సమాచారం తెలుసుకుంటున్న రైతులు

సంగెం : రైతు రుణమాఫీ మూడో విడతపై రైతుల్లో ఆందోళన నెలకొంది. మూడో విడతలో రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 15న ప్రకటించినప్పటి నుంచి రైతులు తమకు వర్తిస్తోందా? అంటూ ఏఓ, ఏఈఓలను సంప్రదిస్తున్నారు. మూడో విడత రుణమాఫీ జాబితా ఇంకా రాలేదని అధికారులు సమాధానం ఇస్తుండడంతో రైతులు ఆందోళన కనపడుతోంది. పలువురికి మూడో జాబితాలో రుణమాఫీ వర్తించనుందని తెలుస్తోంది. కొందరికి కొన్ని సమస్యల వల్ల నిర్ధారణ చేయాల్సి ఉందని స్టేటస్ రిపోర్టులో చూపిస్తుండడంతో తెల్లకాగితంపై రైతుకు సంబంధించిన వివరాలను రాసి మండల వ్యవసాయాధికారికి అందజేస్తున్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే అఘాయిత్యాలు


- ఏఐఎఫ్‌డీడబ్ల్యూ సహాయ కార్యదర్శి రాగసుధ



సమావేశంలో మాట్లాడుతున్న రాగసుధ

నర్సంపేట : పాలకులు అవలంభిస్తున్న తప్పుడు విధానాల వల్లే మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ ఆరోపించారు. పట్టణంలో డివిజన్ నాయకురాలు జమున అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి అతిథిగా రాగసుధ హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడచినా మహిళలు, బాలికలపై దారుణాలు కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. నిందితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న క్రమంలోనే దుర్మార్గాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వెలబుచ్చారు. పాలకులు మహిళలను అంగట్లో సరుకుగా, వ్యాపార వస్తువుగా చూపిస్తూ పాశ్చాత్య సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయని చెప్పారు. కలకత్తాలో మహిళా వైద్యురాలిపై దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తొలుత రెండు నిమిషాలు మౌనం పాటించి కలకత్తాలో హత్యాచారానికి గురైన మహిళా వైద్యురాలికి నివాళులర్పించారు. సమావేశంలో సంఘం నాయకులు గణిపాక బిందు, జ్యోతి, అచల, స్వరూప, నిర్మల, సుభద్ర, లక్ష్మి, పుట్టపాక సునీత, రమ, తదితరులు పాల్గొన్నారు.

పాపన్న జయంతిని వేడుకగా నిర్వహించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సర్వాగౌడ్, నాయకులు

చెన్నారావుపేట : దళిత, బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతిని ఈనెల 18 నుంచి 25 వరకు జిల్లావ్యాప్తంగా వేడుకగా నిర్వహించాలని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ కోరారు. మండల కేంద్రంలో పాపన్నగౌడ్ జయంతి ఉత్సవ వాల్‌పోస్టర్లను రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ అనంతుల రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాగౌడ్ ఆవిష్కరించి మాట్లాడారు. వేడుకల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను భాగస్వాములను చేయాలని సూచించారు. పాపన్న జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మోకుదెబ్బ సెక్రెటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు, నాయకులు కొండాపురం బాలరాజు, బాలాగోని సురేష్, ముత్యం నర్సింహులు, బాలేషం, పశ్చిమడల స్వామి, మంద రామారావు, కొండగొని రవి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్లపైనే చెత్త..

పట్టణంలోని వర్ధన్నపేట-జఫర్‌గడ్ ప్రధాన రహదారిపై రోడ్లపైనే చెత్తాచెదారం దర్శనమిస్తోంది. రెండు రోజులుగా మున్సిపల్ సిబ్బంది చెత్తను తరలించడం లేదని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారంతో దుర్వాసన వస్తోందని, రోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు బెంబేలెత్తుతున్నారు. -వర్ధన్నపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
ఇ.జోనా, మున్సిపల్ కమిషనర్
ఫోన్‌నంబర్ : 9989583055

భాగ్యలక్ష్మి ఉత్తమ సేవలకు గుర్తింపు




నల్లబెల్లి : స్థానిక మదర్ తెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మిని ఉత్తమ సేవలు అందించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారదదేవి స్వాతంత్ర్య వేడుకలో ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడారు. గ్రామైఖ్య సంఘాలకు రుణాలు అందించి నూరు శాతం వసూలు చేసిన సందర్భంగా తనను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. సభ్యులకు వ్యాపారం కోసం రూ.1.33 కోట్ల రుణాలు ఇప్పించి నూరు శాతం వసూలు చేసినట్లు తెలిపారు. సభ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం మరింత ఉత్సాహంగా పని చేస్తానన్నారు. భాగ్యలక్ష్మి ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల ఆమెను పలువురు అభినందించారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని ఊకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుందూరు వాసుదేవరెడ్డి శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి నివాళులర్పించారు. వాసుదేవరెడ్డి మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటన్నారు. నాయకుడిగా వాసుదేవరెడ్డి అందించిన సేవలను కొనియాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మందాటి సుదర్శన్‌రెడ్డి, వల్లపు కుమార్, కేసాని వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరినాథ్, పాల శ్రీనివాస్, రావుల వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీఏఎస్ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

వర్ధన్నపేట : తెలంగాణ అంబేద్కర్ సంఘం (టీఏఎస్) బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య కోరారు. పట్టణంలో జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 18న వర్ధన్నపేటలోని తక్షశిల జూనియర్ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తామన్నారు. సదస్సును జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు తాటికాయల వివేక్, దుబ్బ ఎల్లయ్య, మల్లెపాక చంద్రమౌళి, జంగిలి భాస్కర్, లూనావత్ మంగ్యానాయక్, రామగిరి రామస్వామి పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభాన్ని నిలబెట్టారు..

సాక్షి ఎఫెక్ట్..



సరిచేసిన విద్యుత్ స్తంభం

సంగెం : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని ఆ శాఖ అధికారులు శుక్రవారం యదావిధిగా నిలబెట్టారు. మండలంలోని కాపులకనిపర్తి-కాట్రపల్లి రోడ్డులోని ఇటుకబట్టీల సమీపంలో 11 కేవీ విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉండగా 'ట్రాన్స్‌కో.. జర దేఖో..' శీర్షికతో 'అటెన్షన్ ప్లీజ్' శీర్షికతో 'సాక్షి'లో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. విద్యుత్ స్తంభాన్ని సరిచేసి యథాస్థానంలో నిలపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రమాదమూ జరగకముందే సమస్యను పరిష్కరించేలా కథనం ప్రచురించిన 'సాక్షి'కి, యుద్ధప్రాతిపదికన స్పందించి స్తంభాన్ని నిలబెట్టిన అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్ వ్యాఖ్యలు దుర్మార్గం



నర్సంపేట : అమరవీరుల స్తూపం వద్ద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

- డీసీసీ అధికార ప్రతినిధి రవీందర్‌రావు
- దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన

నర్సంపేట : మహిళలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ పార్టీ అనుబంధ మహిళా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. కేటీఆర్ వ్యాఖ్యలు మహిళలను కించపర్చేలా ఉన్నాయని చెప్పారు. వెంటనే క్షమాపణ కోరాలని హితవు పలికారు. లేనిపక్షంలో మహిళలు తగిన రీతిలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, నాయకులు ఆడెపు రమాదేవి, నూనె పద్మ, పద్మ బాయి పాల్గొన్నారు.

పర్వతగిరి : కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతుంటే కేటీఆర్ ఓర్వలేకనే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సువార్త మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలను విస్మరించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు సునీల్‌రావు, కంటిం సుధాకర్, సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కాంగ్రెస్ అనుబంధ మహిళా విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కర్ర మాలతిరెడ్డి మాట్లాడారు. కేటీఆర్ అహంకారంతో మహిళలను అవమానించేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో నాయకులు తీగల సునీత, దేవేంద్ర యాదవ్, మైస సురేష్, సమ్మెట సుధీర్, నాంపెల్లి రవీందర్, చిదరాల కుమారస్వామి, యాదగిరి, కొండేటి బాలకృష్ణ, కొండేటి మధుకర్, కర్ర శ్రీనివాసరెడ్డి, సిలువేరు శ్రీధర్, మామిండ్ల సారయ్య, సుజాత, చీటూరి రాజు పాల్గొన్నారు.

మహిళల్లో ప్రతిభ వెలికితీసేలా పోటీలు



మహిళకు బహుమతి అందజేస్తున్న రీనా

నర్సంపేట : మహిళల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఆటల పోటీలు దోహదపడతాయని ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) రీనా తెలిపారు. పట్టణంలో ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మగ్గం శిక్షణ పొందుతున్న ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన మహిళలకు ఆమె శుక్రవారం బహుమతులు అందజేసి మాట్లాడారు. మగ్గం శిక్షణతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రతిభ సంస్థ నిర్వాహకుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, కన్స్యూమర్ ఫోరమ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు నాగెల్లి సారంగంగౌడ్, గండి యాదగిరి, ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్, స్వచ్ఛంద వలంటీర్లు మొగిలిచర్ల రాముసేవక్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం



రాజేందర్‌తో డాక్టర్ గోపాల్, తదితరులు

నర్సంపేట : ప్యారిస్‌లో టెక్నికల్ అఫీషియల్‌గా ఎన్నికైన సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్‌ను పట్టణంలోని షటిల్ ప్లే గ్రౌండ్‌లో స్థానిక డివిజన్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి సిద్దోజు లక్ష్మణచారి మాట్లాడారు. ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ప్యారిస్‌లో జరగనున్న పారా ఒలింపిక్స్-2024కు రాజేందర్ టెక్నికల్ అఫీషియల్ షటిల్ ప్లేయర్ తొలిసారిగా ఎన్నికయ్యారని చెప్పారు. రాజేందర్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌కు ప్రాధాన్యత ఉందన్నారు. సైనా నెహ్వాల్, సింధు, శ్రీకాంత్, సాత్విక్, సాయిరాజ్, సిక్కిరెడ్డి లాంటి తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ప్రపంచ వేదికలపై సత్తా చాటుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గోపాల్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, జాతీయ క్రీడాకారులు హర్జియా, సునీల్, రాజు, బిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, సీనియర్ క్రీడాకారులు ఆడెపు సదానందం, సుదర్శన్‌రెడ్డి, తిరుపతి, సుశాంత్, తేజ, షఫీ, అహ్మద్, మోహన్, రాకేష్, ప్రశాంత్, రంజిత్, నితీష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పర్వతగిరి : వీధి దీపాల మరమ్మతు పనులు చేపట్టనున్న క్రమంలో మండలంలోని పర్వతగిరిలో నేడు (శనివారం)విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజలు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.